

కొత్త ఓటర్లు 14,475

- జిల్లాలో 19,62,440కు చేరిన ఓటర్ల సంఖ్య
- భీమిలిలో అత్యధికంగా 3,55,081 మంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నాటికి ఓటర్ల సంఖ్య 19,62,440కు చేరింది. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా తరువాత కొత్తగా చేర్పులు, తొలగింపులు చేపట్టారు. ఇందులో భాగంగా గత 38 రోజుల్లో 24,781 మంది కొత్త ఓటర్లు నమోదు కాగా 4,934 మందిని జాబితా నుంచి తొలగించారు.



జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అత్యధికంగా భీమిలిలో ఓటర్ల సంఖ్య 3,55,081కు చేరింది. తాజాగా ఓటర్ల నమోదు తరువాత మూడు లక్షల ఓటర్లు దాటిన నియోజకవర్గాల్లో భీమిలి, గాజువాక సరసన పెందుర్తి కూడా చేరింది. జనవరి 22వ తేదీ నాటి తుది జాబితాలో పెందుర్తిలో 2,99,103 మంది ఓటర్లు ఉన్నారు. మూడు లక్షల ఓట్లు దాటిన అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఐదు ఉండగా వాటిలో మూడు విశాఖ జిల్లాలోనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన జాబితా మేరకు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి 19,42,593 ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు పదిరోజుల ముందు వరకు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం ఉంది. అదే సమయంలో ఓటర్ల జాబితాలో మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు తొలగిస్తారు. ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిలో ఒక ఓటు ఉంచి, మిగిలిన ఓట్లు తొలగించే ప్రక్రియ చేపట్టవచ్చు. ఈ నేపథ్యంలో జనవరి 22వ తేదీ నుంచి గురువారం వరకు 24,781 మంది ... మిగతా 6వ పేజీలో


జిల్లాలో ఓటర్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	జనవరి 22	ఫిబ్రవరి 29
భీమిలి	3,51,462	3,55,081
విశాఖ తూర్పు	2,76,523	2,80,609
విశాఖ దక్షిణ	2,10,131	2,11,906
విశాఖ ఉత్తర	2,74,760	2,77,904
విశాఖ పశ్చిమ	2,06,943	2,08,880
గాజువాక	3,23,671	3,27,269
పెందుర్తి	2,99,103	3,00,791

అడుగడుగునా నిఘా!

పోలీసులతో నిండిపోయిన బీచ్ రోడ్డు

- రుషికొండ భవన సముదాయం ప్రారంభోత్సవం ప్రభావం
- విస్తృత తనిఖీలతో జనం గగ్గోలు
- విద్యాలయాల సిబ్బంది, ఐటీ ఉద్యోగుల అడ్డగింత
- సామాన్యులకు తప్పని కష్టాలు



బీచ్‌రోడ్డులో భారీ ఎత్తున మోహరించిన పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో గురువారం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. తెల్లవారు జాము నుంచి బీచ్ రోడ్డును తమ అధీనంలోకి తీసుకున్నారు. రాకపోకలను నిర్బంధించారు. అడుగడుగునా విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐడీ కార్డులు లేని వారిని వెనక్కి పంపించారు. జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులను కూడా అనుమతించలేదు. ఇక్కడేదో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమం జరుగుతుందేమోనని అంతా అనుకున్నారు. కానీ జరిగింది ప్రభుత్వ కార్యక్రమం... రుషికొండపై నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవం. పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కే రోజాతో పాటు ఐటీ శాఖా మంత్రి అమర్‌నాథ్ దీనికి హాజరయ్యారు.

రుషికొండపై భవన నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచీ బీచ్‌రోడ్డుపై ప్రయాణమంటేనే నగరవాసులు



రుషికొండపై భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి రోజా, శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

హడలెత్తిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏ చిన్న కార్యక్రమమైనా పోలీసులతో నింపేస్తున్నారు. విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. రాకపోకలపై విపరీతమైన ఆంక్షలు విధిస్తున్నారు. ఫలితంగా పోలీసుల తీరుపై జిల్లా వాసుల్లో తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తుతోంది. రుషికొండపై ప్రజాధనంతో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం చేసిన హడావుడిపైనా తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టూరిజం శాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం నిర్మించిన భవనాలు అంటూ మంత్రులు ఆర్‌కే రోజా, గుడివాడ అమర్‌నాథ్ ప్రకటించారు. మరి ఈ కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం లేకుండా అడ్డంకులు ఎందుకు సృష్టిస్తున్నారో మంత్రులు గానీ, అధికారులు, పోలీసులు గానీ ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



బీవీకే కళాశాల పరీక్ష హాల్లో నంబర్లు వేస్తున్న దృశ్యం

విశాఖపట్నం/ మద్దిలపాలెం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 93 కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ప్రథమ ఏడాది విద్యార్థులకు లాంగ్వేజ్-2 (తెలుగు, సంస్కృతం, ఉర్దూ) పరీక్ష జరుగుతుంది. జిల్లాలో ప్రథమ ఏడాది విద్యార్థులు 42,267 మంది పరీక్షలకు హాజరవుతారు. వీరిలో బాలురు 21,693, బాలికలు 19,181 మంది ఉన్నారు. సీసీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి ఆర్‌ఐవో కార్యాలయంలో 0891- 2552854, 2567561 హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులంతా 30 నిమిషాలు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు. ఆలస్యంగా వస్తే అనుమతించమన్నారు. నగరంలో అత్యధికంగా పీఎంపాలెంలోని శ్రీచైతన్య కళాశాల, వన్‌టౌన్‌లోని ఏవీఎన్ కళాశాలల్లో 700 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పాతజైలురోడ్డు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో 650మంది, కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600, బుల్లయ్య కళాశాలలో 500 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు.

150 మంది దివ్యాంగ విద్యార్థులు..

ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 150 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరుకానున్నారు. పదో తరగతి వరకు బ్రెయిలీ లిపిలో చదువుకుని ఈ ఏడాది ఇంటర్‌లో చేరారు. వీరు పరీక్షలు రాసేందుకు వీలుగా ఏడు, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులను సహాయకులుగా నియమించారు. సాధారణ విద్యార్థులకు 35 మార్కులు ఉత్తీర్ణత కాగా, దివ్యాంగులు కేవలం పది మార్కులు తెచ్చుకుంటే ఉత్తీర్ణులయినట్టేనని అధికారులు తెలిపారు.

ఉరుకూటికి గన్‌మన్లు కట్!!

- గాజువాకలో వైసీపీ సమన్వయకర్తను మారుస్తారని ఊహాగానాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

గాజువాకలో వైసీపీ రాజకీయం కాక రేపుతోంది. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావుకు నియమించిన గన్‌మన్లను తొలగిస్తూ జిల్లా యంత్రాంగం తాజాగా చర్యలు తీసుకుంది. అతను ఎటువంటి అభ్యర్థన చేయకుండానే నెల రోజుల క్రితం 2 + 2 గన్‌మన్లను కేటాయించి, ఆ తరువాత 1 + 1కి మార్చింది.

జిల్లాలో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తలంతా గన్‌మన్లతో హంగామా చేస్తున్నారు. కానీ కార్పొరేటర్‌గా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆశీస్సులతో నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితుయ్యారు. అంతే పోలీసులు అడగకుండానే బందోబస్తు కల్పించారు. ఇప్పుడు తీసేయడానికి కారణమేమిటా? అని ఆరా తీయగా... ఎవరికి పడితే వారికి గన్‌మన్లు ఎందుకు కేటాయిస్తున్నారంటూ పలు జిల్లాల్లో కోర్టులు ప్రశ్నిస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారంటున్నారు. కానీ మిగిలిన వైసీపీ సమన్వయకర్తలకు కాకుండా చందూకే ఎందుకు తీశారనేది ప్రశ్న. గాజువాక నుంచి ఎలాగైనా పోటీ చేయాలని సిటింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రయత్నిస్తున్నారు. అధిష్ఠానం మాత్రం ఈసారి అవకాశం లేదని తేల్చేసింది. ఉరుకూటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ ఎంపీ అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య, మాజీ ఎంపీ ఝాన్సీని ప్రకటించింది. దీంతో మంత్రి బొత్స ఈ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థుల బలాబలాలు బేరీజు వేసుకున్నారు. గాజువాకలో ఉరుకూటి కంటే... మేయర్ హరికుమారి మేలని భావించి, అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే గన్‌మన్లను తొలగించారని అంటున్నారు. అంతేకాకుండా కొద్దిరోజుల్లో కొత్త సమన్వయకర్త పేరు ప్రకటిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో రాక్షస పాలన

వైసీపీ నేతల అవినీతిని ప్రశ్నిస్తే దాడులు

- యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవు
- ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశారు
- ధ్వజమెత్తిన నారా భువనేశ్వరి
- చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి' కార్యక్రమాలు

అనకాపల్లి/ రోలుగుంట/ రావికమతం/ బుచ్చెయ్యపేట/, ఫిబ్రవరి 29: వైసీపీ నాయకులు నరరూప రాక్షసుల్లా ప్రవర్తిస్తూ, వారి అక్రమాలను ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం జేపీ అగ్రహారం, కొవ్వూరు, రావికమతం మండలం గంపవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం, ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం అరబుపాలెం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్రమనస్తాపానికి గురై గుండెలు ఆగిన పలువురి కుటుంబాలను



బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కొవ్వూరు, గంపవానిపాలెం, ఆర్.భీమవరం గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న, కల్తీ మద్యంపై ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలను వైసీపీ నాయకులు పొట్టనబెట్టుకున్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పరువు, ప్రతిష్ఠలు దిగజారిపోయాయని, ఉద్యోగ/ఉపాధి ... మిగతా 6వ పేజీలో

భయపెడుతున్న చోరీలు

నగరంలో పెరుగుతున్న వైనం



- వరుస చైన్‌స్నాచింగ్‌లు, ఇళ్లల్లో దోపిడీలు
- నియంత్రణలో విఫలమవుతున్న పోలీసులు
- ప్రముఖుల బందోబస్తుకే పరిమితం
- రాత్రి సమయంలో తగ్గుతున్న నిఘా

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న చోరీలు నగరవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత నెల రోజులుగా దాదాపుగా ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీ సంఘటన వెలుగు చూస్తోంది. పట్టపగలే దర్జాగా దొంగతనాలు జరుగుతున్నా అరికట్టలేని స్థితిలో పోలీసు యంత్రాంగం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నగరంలో ప్రముఖుల పర్యటనలు, అధికార పార్టీ నాయకుల సభలు ఇతర కార్యక్రమాలకు బందోబస్తు నిర్వహించేందుకే పోలీసు యంత్రాంగం పరిమితమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇటీవల నగరంలో చోరీలు పెరుగుతున్నాయి. తాజాగా పెందుర్తి ప్రశాంతినగర్‌లోని రాయల్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం పట్టపగలే ఇంటితాళాలు పగలకొట్టి నగలు, నగదు దోచుకుపోయిన సంఘటన పోలీసు యంత్రాంగాన్ని కలవరపాటుకి గురిచేసింది. చోరుడు దర్జాగా కారులో వచ్చి, అఫీషియల్‌గా ఫోన్‌లో మాట్లాడుతూ చోరీ చేయడం విశేషం. దీనిపై పోలీసులు విచారణ ప్రారంభించకముందే దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిరణా దుకాణానికి వెళ్లిన ఓ ఆగంతకుడు వ్యాపారి లక్ష్మీ మెడలోని ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుని పరారైపోవడం పోలీసులకు సవాల్ విసిరినట్టయింది.

నగరంలో ఇళ్లలో చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. వారం వ్యవధిలోనే పెందుర్తి పరిసరాల్లో నాలుగు ఇళ్లలో చోరీలు, సీబీఎం కాంపౌండ్‌తోపాటు దువ్వాడ ప్రాంతాల్లో రెండు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. దీనికి పోలీసుల వైఫల్యమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో నేర పరిశోధనావిభాగం చురుగ్గా పనిచేసేది. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేపట్టడం, బీట్ గస్తీ పక్కాగా నిర్వహించేవారు. క్రైమ్ విభాగం అధికారులు నిరంతరం సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారులతోపాటు కిందిస్థాయి సిబ్బంది పనితీరును నిత్యం సమీక్షించేవారు.

బందోబస్తు బాధ్యతల్లోనే...

తాజాగా పరిస్థితి మారిపోయింది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో క్రైమ్ విభాగంలో ఎవరు ఏ పనిచేస్తున్నారనే దానిపై ... మిగతా 6వ పేజీలో

నకిలీ అధికారి ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థే

- స్టేషన్‌కు పిలిపించిన ఆనందపురం పోలీసులు
- ఎంఈవోపై చర్యలకు విద్యాశాఖ మీనమేషాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా వలంటీర్‌నంటూ ఆనందపురం మండలంలో హల్‌చల్ చేసిన నకిలీ విద్యాధికారి చరణ్ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి అని తేలింది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్ష రాయడానికి సన్నద్ధమైన తరుణంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆనందపురంలో నకిలీ విద్యాధికారి వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదుచేసి నకిలీ అధికారిని గురువారం స్టేషన్‌కు పిలిపించారు.



చరణ్

ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఒకరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆరోపణలు ఎదుర్కొంటున్న చరణ్ శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నాడని వివరించారు. పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వడంలో భాగంగా విడిచిపెట్టాలని కోరినట్టు తెలిసింది. దీంతో తాత్కాలికంగా చరణ్ పరీక్షలు రాసేందుకు అనుమతించారని చెబుతున్నారు. ఇంటర్ విద్యార్థి జిల్లా విద్యా వలంటీర్‌నని చెప్పుకోవడంపై పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేసి యువకుడి తీరును తీవ్రంగా పరిగణించారని చెబుతున్నారు. ఇదే సమయంలో యువకుడితోపాటు ఆనందపురం ఎంఈవోపై కూడా యూటీఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫోన్‌చేస్తే ఆ అధికారి స్టేషన్‌కు రాలేదని అంటున్నారు. నకిలీ అధికారి ఫోన్ నంబరును మండలస్థాయి వాట్సాప్‌గ్రూప్‌లో చేర్చడంతోపాటు రెండురోజులపాటు గూగుల్ మీట్ నిర్వహించిన వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు తొలుత తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉన్న ఆనందపురం ఎంఈవోపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ డీఈవో కార్యాలయం వర్గాలు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రధాన కూడళ్లలో నిఘా నేత్రాలు

దొంగతనాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 29: మహా నగరంలోని అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. వేంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్, అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రోడ్డు, ప్రధాన రహదారి, నరసింహనగర్ ప్రాంతాల్లోని కూడళ్లతో పాటు వాణిజ్య సముదాయాలు, రైతు బజార్లు, అపార్ట్‌మెంట్ల వద్ద, పెట్రోల్ బంకులు, బ్యాంకులు, హోటళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలకు పాల్పడాలనుకునే వారు వెనకంజ వేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ ఎక్కడైనా చోరీలు, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను ఇష్టారాజ్యంగా నడిపే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా ఆస్కారం ఉంటుంది. మొత్తంమీద ఇటు శాంతిభద్రతల దృష్ట్యా గానీ అటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కానీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.


వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు


నరసింహనగర్ రైతు బజారులో సీసీ కెమెరాలు

ఓపీఎస్ అమలు చేస్తామన్న పార్టీకే మద్దతు

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్

మర్రిపాలెం, ఫిబ్రవరి 29: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే రానున్న ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ అన్నారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన ఓటు మన భవిష్యత్తు-ఓటు ఫర్ ఓపీఎస్' పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే తమ మేనిఫెస్టోలో ఓపీఎస్‌ను అమలు చేస్తామని, మొదటి సంతకం ఓపీఎస్ ఫైలుపైనే చేస్తామని హామీ ఇస్తుందో ఆ పార్టీకే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేత దాసరి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అప్పారావు, జిల్లా నాయకులు ఎస్.ప్రభాకర్, కె.రాంబాబు, చుక్క సత్యం, రిజ్వాన్, రియాజ్, టి.జగన్, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండపై విధ్వంసం సృష్టించిన వైసీపీ

జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్

సీతంపేట, ఫిబ్రవరి 29: వందల ఏళ్ల చరిత్ర కలిగిన రుషికొండపై వైసీపీ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. పండుగలు వసేత రుషికొండకు వచ్చేస్తున్నానంటూ సీఎం జగన్ దీపావళి, దసరా, సంక్రాంతి, ఉగాది.. ఇలా ఏ పండుగను వదల్లేదని.. చివరకు గుట్టుచప్పుడు కాకుండా మంత్రి రోజాతో రుషికొండపై భవనాన్ని ప్రారంభింపజేశారని ఎద్దేవా చేశారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద కోట్ల రూపాయల ఆదాయం తెచ్చే హరిత రిసార్ట్స్‌ను కుట్రతోనే కూలగొట్టారని, 9.88 ఎకరాల్లో నిర్మాణాలు చేపడతామని అనుమతులు తీసుకుని 23 ఎకరాల మేరకు రుషికొండను తవ్వేశారని మండిపడ్డారు. రుషికొండపై భవనాల నిర్మాణంపై కోర్టులో కేసులు ఉండగా ప్రారంభించడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు.

జగన్‌కు చట్టాలు, కోర్టులంటే భయం లేదని, పులి అని చెప్పుకునే తాడేపల్లి పిల్లి రుషికొండపై జరిగిన భవన ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారమే నిర్మాణాలుంటే మీడియాను, ప్రజలను ఎందుకు అనుమతించలేదన్నారు. ఈ సమావేశంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి యాదవ్


రుషికొండ రహదారిపై స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీసులు

అడుగడుగునా నిఘా!

... 5వ పేజీ తరువాయి

సమాధానం ఇవ్వడం లేదు. అన్ని అనుమతులతో పక్కాగా నిర్మాణాలు జరిగాయని చెబుతున్నప్పటికీ, ఇంతలా ప్రజలను నిర్బంధించి కార్యక్రమం నిర్వహించడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులకు నరకయాతన

బీచ్‌రోడ్డులో పలు విద్యాలయాలు ఉన్నాయి. ఐటీ కంపెనీలు కూడా ఇదే మార్గంలో ఏర్పాటు చేశారు. వీటిలో వందల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. నగరంలో నివాసముంటూ ప్రతిరోజూ ఆయా కార్యాలయాలకు వెళ్లి, వస్తుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఉద్యోగులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఏ చిన్న కార్యక్రమం జరిగినా వందల సంఖ్యలో పోలీసులను మోహరించడం, తనిఖీల పేరుతో ఉద్యోగులను వేధించడం రివాజుగా మారిపోయింది. గురువారం కూడా ఇదే పరిస్థితి ఎదురయింది. ద్విచక్రవాహనాలు, కార్లలో వస్తున్న ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. విస్తృత తనిఖీలు, శల్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలను ఆరా తీశారు. ఐడీ కార్డులు చూపించినప్పటికీ.. ఆయా కంపెనీలకు మరో దారి లేకపోతేనే రుషికొండ మీదుగా ప్రయాణానికి అనుమతించారు. లేదంటే ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలంటూ వెనక్కి పంపించేశారు. ఫలితంగా సమయానికి కార్యాలయాలకు చేరుకోలేకపోయామని పలువురు వాపోయారు.

మీడియాపైనా ఆంక్షలు

బీచ్‌రోడ్డులో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు అనుమానితులను రుషికొండ వైపు వెళ్లకుండా వెనక్కి పంపించారు. మీడియా ప్రతినిధులను కూడా రుషికొండ పరిసరాల వరకు చేరనివ్వలేదు. రుషికొండ రహదారికి ఇవతల వైపు నిల్చొని లోపలికి వెళ్తున్న వాహనాల ఫొటోలు తీసుకున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరి మొబైల్ ఫోన్‌ని ఓ పోలీస్ అధికారి లాక్కున్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రుషికొండకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి, ముందుగానే హౌస్ అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో రుషికొండ వరకు వెళ్లకుండా ఆపేశారు. సీఎం జగన్ పర్యటనల్లో భద్రత పేరుతో హడావుడి చేసే పోలీసులు ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఇన్ని అడ్డంకులు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

కొత్త ఓటర్లు 14,475

... 5వ పేజీ తరువాయి

కొత్తగా ఓటరుగా నమోదు కాగా 4,934 మందిని తొలగించారు. కొత్త ఓటర్లగా జిల్లాలో అత్యధికంగా గాజువాకలో 4,546 మంది చేరగా, తక్కువగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 2,118 మంది చేరారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల తరువాత పోలింగ్‌కు పదిరోజుల ముందు వరకు కొత్తగా ఓటర్ల చేర్పులు, మార్పులకు అవకాశం ఉన్నందున జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

... 5వ పేజీ తరువాయి

అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారన్నారు. ఏపీని గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాలో నంబరు వన్ స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశాడన్నారు. జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని, మీ పిల్లలతోపాటు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం 'సూపర్ సిక్స్'ను అమలు చేస్తుందని, మహిళలకు మరిన్ని పథకాలను తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు.

భయపెడుతున్న చోరీలు

... 5వ పేజీ తరువాయి

జబాబుదారీతనం లోపించిందనే వ్యాఖ్యలు పోలీసు సిబ్బంది నుంచే వినిపిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక వేడుక పేరుతో అధికార పార్టీ నేతలకు బందోబస్తులు, ప్రముఖుల పర్యటనల వద్ద విధుల్లో ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు. దీంతో క్రైమ్ విభాగం పనితీరు సమీక్షించడం, కొత్తగా నేరం జరిగితే ఎవరు పాల్పడి ఉంటారనే దానిపై విశ్లేషణ చేయడం, ఆధారాలు సేకరించడం, ఆ తరహా నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ, ఎస్ఐలతోపాటు కిందిస్థాయి సిబ్బందితో విశ్లేషించే పరిస్థితి కనిపించడం లేదు. క్రైమ్ విభాగంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఎస్ఐలే బాధ్యతలు నిర్వహిస్తుండడంతో వారిని ప్రశ్నించే నాథుడే లేకుండా పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఒకే తరహా ముఠా పలు ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్నా పోలీసులు గుర్తించలేకపోతున్నారని పోలీస్‌శాఖలోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

నటరాజ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో గజ్జ పూజ

సీతంపేట, ఫిబ్రవరి 29: శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవనంలో నటరాజ నృత్య నికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులకు గురువారం ఘనంగా గజ్జ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం ఉట్టి పడుతుందన్నారు. కె.సన్యాసిరావు, వెంకటేశ్వరావు, డాక్టర్ బీపీఎస్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో సామాజిక భవనాలు ప్రారంభం

సీతమ్మధార, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 24వ వార్డు పరిధిలోని నక్కవానిపాలెం, క్రాంతినగర్, పాత రేసపువానిపాలెం ప్రాంతాల్లో రూ.45 లక్షలతో నిర్మించిన మూడు సామాజిక భవనాలను గురువారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ 'ఉత్తర' సమన్వయకర్త కేకే రాజు పూజ చేశారు.

ఉపాధ్యాయినికి ఘనంగా సన్మానం

సీతమ్మధార, ఫిబ్రవరి 29: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలో గల ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న నిష్టల అనుసూయ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

సీతంపేట, ఫిబ్రవరి 29: సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ, శైవాగమ పండితులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం వేదమంత్రాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఇందులో కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, వాస్తు పూజ అంకురార్పన, ధ్వజారోహనం, అగ్ని ప్రతిష్టాపన, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పార్వతీ పరమేశ్వరుల కలాణాన్ని వీక్షించారు.


వేదికపై శివపార్వతులు


పీఠాధిపతి జయరాజ్‌ను సన్మానించిన దృశ్యం

విశాఖ అగ్రపీఠాధిపతి జయరాజ్‌కు అభినందనలు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 29 : రోమన్ కేథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠ పరిపాలానాధికారిగా నియమితులైన డాక్టర్ పొలిమేర జయరాజును జ్ఞానాపురంలోని ప్రధాన పునీతపేతురు దేవాలయంలో చర్చి ఫాదర్లు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రకాష్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, బాల శౌరి, కోన జయరాజ్, పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్ పాల్గొన్నారు.


తుప్పలతో అడవిని తలపిస్తున్న సెమెట్రీ

రెజిమెంటల్ సెమెట్రీలో పేరుకుపోయిన తుప్పలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 29 : జీవీఎంసీ 31, 29వ వార్డుల పరిధిలో ఉన్న రెజిమెంటల్ సెమెట్రీ ద్వారం డంపింగ్‌యార్డ్‌లా మారిపోయింది. సెమెట్రీ చుట్టు పక్కల ఉన్న వారు కోళ్ల వ్యర్థాలు, ఇతర చెత్తను సెమెట్రీలో పడేస్తుండడంతో కాలుష్యం పెరిగిపోతోంది. ఈ సెమెట్రీని 1700లో ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఇక్కడ అనేక మంది ప్రముఖుల సమాధులను ఏర్పాటు చేశారు. ఇది వాల్తేరు సెమెట్రీకి అనుబంధంగా పనిచేస్తుంది. ఏటా రెండు, మూడుసార్లు మాత్రమే పరిశుభ్రం చేయిస్తున్నారు. నిధుల లేని వల్ల కొన్నాళ్లుగా పనులు చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి సెమెట్రీ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'రాజేశ్‌కు ఇచ్చిన టికెట్‌ను రద్దు చేయాలి'


విలేకరుల సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం నాయకులు

మహరాణిపేట, ఫిబ్రవరి 29 : మహాసేన రాజేశ్‌కు ఇచ్చిన టికెట్‌ను వెంటనే రద్దు చేయాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుడు వీవీ వామనరావు కోరారు. గురువారం బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని, అగ్రవర్ణాలను అవమానిస్తూ మాట్లాడిన రాజేష్‌కు వచ్చే ఎన్నికల్లో టీడీపీ పి. గన్నవరం టికెట్ కేటాయించిందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. రాజేశ్ బ్రాహ్మణ అమ్మాయిలను అవమానపరిచారని అటువంటి వ్యక్తిని ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రోత్సాహించడం తగదని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆకెళ్ల వెంకటరమణమూర్తి, శ్రీవాత్సవ్, నండూరి సుబ్రహ్మణ్యం, పీవీ నారాయణ, జోష్యుల సురేష్, రాచకొండ దశరథ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల అద్దాలకు ఫిల్మ్‌లు అతికిస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏడీసీపీ డి. శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 29 : కార్లు, ఇతర వాహనాల యజమానులు అద్దాలకు ఎటువంటి ఫిల్మ్‌లు అతికించరాదని ట్రాఫిక్ ఏడీసీపీ డి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళల అక్రమ రవాణా, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, కిడ్నాప్, తదితర నేరాలను అరికట్టే ఉద్దేశంతో సుప్రీం కోర్టు వాహనాల అద్దాల తయారీ సమయంలో దృశ్య క్రాంతి ప్రసారం ముందు వెనుక అద్దాలకు 70 శాతం పక్క అద్దాలకు 50 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలి పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఉత్తరం'లో మహా శివరాత్రికి సిద్ధమవుతున్న శైవ క్షేత్రాలు

మురళీనగర్, ఫిబ్రవరి 29: ఉత్తర నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు మహా శివరాత్రికి ముస్తాబవుతున్నాయి. మార్చి ఎనిమిదిన మహా శివరాత్రి నేపథ్యంలో ప్రసిద్ధ ఆలయాల్లో ఘనంగా పూజాది కార్యక్రమాలను నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. మురళీనగర్ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ శాంతి ధామంలో ఐదు రోజుల జరిగే మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్యేక సంబరాలు జరుపుతామని సెంటర్ నిర్వాహకురాలు బీకే అపరంజి తెలిపారు. ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి శివతత్వాన్ని బోధించడంతో పాటు, శాంతి ధామం కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడతామన్నారు. మాధవధార కొండపై శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో సింహాచల దేవస్థానం అధ్వర్యంలో వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన అత్యధికంగా భక్తులు తరలి రానున్నందున దర్శన ఏర్పాట్లు, సౌకర్యాలపై ఈవో ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోని సోమేశ్వర ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 49వ వార్డు పరిధి కంచరపాలెం బర్మాక్యాంపులోని శివాలయం సహా పలు గ్రామ కమిటీల ఆధ్వర్యంలో, మురళీనగర్ శివాలయం, తదితర శైవ క్షేత్రాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్నాయి.

న్యూరాలజీ విభాగంలో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం

మహరాణిపేట, ఫిబ్రవరి 29 : కేజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో స్ట్రోక్ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. ఆరు పడకల యూనిట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో డా. ఎస్.గోపి, డా కె. వెంకటేశ్వర్లు, డా వై. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మహరాణిపేట, ఫిబ్రవరి 29 : కేజీహెచ్‌లో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగం వద్ద గోపాలపట్నంకు చెందిన పి. సురేష్ (32) ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బంది గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా కేజీహెచ్‌లో ఐదు ద్విచక్ర వాహనాలు, మల్కాపురం సమీపంలో రెండు చోరీ చేసినట్టు అంగీకరించాడు. ఈమేరకు క్రైమ్ ఎస్ఐ ఎస్. రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉడా కాలనీలో వీధి కుక్కల భయం!

మురళీనగర్, ఫిబ్రవరి 29 : ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో వీధి కుక్కల సంచారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కలు గుంపు గుంపులుగా సంచరిస్తూ వాహనాలపై వెళ్లే వారి వెంటపడుతున్నాయి. పిల్లలు సాయంత్రం పార్కులు, ట్యూషన్ సెంటర్లకు వెళ్లి వచ్చేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కొండవాలులో నిర్మానుష్యంగా ఉండే ప్రాంతం కావడంతో ఉడా కాలనీ ఎల్ఐజీ, ఎంఐజీ ఫేజ్‌లతో పాటు విలాస భవనాలు ఉండే హెచ్ఐజీ సెక్టార్లు, పార్కుల వద్ద వీటి తాకిడి ఎక్కువగా ఉంది. ఆర్టీఓ కార్యాలయం పరిసరాలు, ఆలయాల వద్ద వీధి కుక్కల సంచా రంతో నివాసితులు పగలు, రాత్రి వేళల్లోనూ ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడు తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వీధిలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

వయోశ్రీ యోజన లబ్ధిదారుల గుర్తింపు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 29 : ప్రధాని రాష్ట్రీయ వయోశ్రీయోజన పథకం లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం గంగవరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు హాజరయ్యారు. 60 ఏళ్లు పైబడిన వారికి కళ్లద్దాలు, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్స్, నడుము బెల్టులు, మోకాళ్ల బెల్టులు, తదితర ఆరోగ్య అవసర ఉపకరణాలు అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ వయోశ్రీయోజన పథకం కో-ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, స్థానిక పెద్దలు గరికిన పైడిరాజు, వెంకటేశ్, పి.అప్పారావు, మాధవి, జీలకర్ర రమణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతర రాట

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా గురువారం అమ్మవారి బాలాలయంలో రాట ముహూర్తాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభం కానుందని, ఎనిమిదో తేదీన కొత్త అమావాస్య పూజలు జరగనున్నాయని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిదో తేదీన ఆలయంలో ఉగాది వేడుకలు జరుగుతాయన్నారు.



86వ వార్డు పరిధి వుడా ఫేజ్-1 కాలనీలో అధ్వానంగా ఉన్న పార్కు



71వ వార్డు వడ్లపూడి రైల్వే పార్కులో పాడైపోయిన చిన్నారుల ఆట వస్తువు



86వ వార్డులోని ద్వారకాపురి కాలనీలో పచ్చదనం కోల్పోయిన పార్కు

పార్కులిలా.. సేదదీరేదెలా?

పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిన 71, 86 వార్డుల్లోని పార్కులు

మూలకు చేరిన చిన్నారుల ఆట వస్తువులు

అధికారులు, పాలకులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకోలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 29: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 71, 86 వార్డుల్లోని పార్కులు అస్తవ్యస్తంగా మారాయి. ఆహ్లాదకరంగా గడిపేందుకు, చిన్నారులు ఆడుకునేందుకు వీల్లేకుండా ఆయా పార్కులు మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 71వ వార్డు పరిధి వడ్లపూడి రైల్వే పార్కులో చిన్నారుల ఆట వస్తువులు పాడైపోవడంతో నిరుపయోగం పడి ఉన్నాయి. ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోవడంతో పార్కులోకి వెళ్లేందుకే స్థానికులు వెనకడుగు వేస్తున్నారు. అలాగే 86వ వార్డు పరిధిలోని ద్వారకాపురి కాలనీ పార్కు, వుడా ఫేజ్-1లోని పార్కులో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో పాముల బెడద అధికమైందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా పార్కుల్లో సేదదీరేందుకే అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. కనీసం వాకింగ్ చేసేందుకు కూడా వీల్లేకుండా ఉన్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. పార్కులను అభివృద్ధి చేయకుండా పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు.

కాగా కొన్ని పార్కులను పలువురు పశువుల స్థావరాలుగా వినియోగించుకుంటున్నారు. పార్కులను అభివృద్ధి చేయవలసిందిగా పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా పార్కుల అభివృద్ధికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వుడా ఫేజ్-1లో గేటు లేకుండా వ్యర్థాలతో నిండిన పార్కు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ హరి వెంకటకుమారి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 29: అభివృద్ధి విషయంలో గాజువాక ప్రాంతానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని నగర మేయరు గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 64వవార్డుపరిధిలో రూ 79.92లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యం, డ్రైనేజీలు, కాల్వలు, కల్వర్టర్లు, సీసీ ప్లాటుఫారం ఏర్పాటు చేసేందుకు నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గం శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు దల్లి గోవిందరెడ్డి, ఇమ్రాన్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, ఫిబ్రవరి 29: పురుషోత్తపురం 33/11కేవీ, ఎల్బీనగర్ 11కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డీవీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పురుషోత్తపురం, గోకులధాం కాలనీ, టీచర్స్ కాలనీ, సేనాతివానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి రాంపురం 11కేవీ ఫీడర్, గొరపల్లి, రాంపురం సబ్ స్టేషన్లలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రాంపురం, సాధూమఠం, హర్షవర్ధన్‌నగర్, గంగమ్మపేట, గొరపల్లి, గవరపాలెం, వెల్ఫేర్ కళాశాల, కోట్నీవానిపాలెం, గవరపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఫిబ్రవరి 29: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ పశ్చిమ నియోజవకర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు పరిధి హిమాచల్‌నగర్‌లో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. సీఎం జగన్ మహిళా సాధికారిత కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు రేవల సత్యనారాయణ, వైఎస్సార్‌టీయూసీ పశ్చిమ ఇన్‌చార్జి పుర్రె సురేశ్, టీచర్ కాకి గౌరీరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు సీనియర్ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 29: సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి పదవీ విరమణ చేస్తున్న సీనియర్ ఉద్యోగుల సేవలను యువ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని భెల్ హెచ్‌పీవీపీ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.చంద్రశేఖర్ సూచించారు. భెల్ ఎంప్లాయీస్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ మేనేజర్‌గా విధులు నిర్వహించి గురువారం ఉద్యోగ విరమణ చేసిన గవర వెంకట రమణారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కార్మిక నాయకులు బొండా బాబూరావు, ఎస్.సాహు, ఉరుకూటి బాబురావు, దేముడు, ప్రకాష్, రాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి.
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 28, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 65, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీర దోస 30, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండ ఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

రెవెన్యూ అధికారులపై ఆర్డీవో ఆగ్రహం

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే చోద్యం చూస్తున్నారా అంటూ మండిపాటు

సర్కారు స్థలాల పర్యవేక్షణ బాధ్యత వీఆర్‌వోలదే..

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతుండడంపై ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ గాజువాక రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం సర్వే నంబర్-32 ప్రభుత్వ భూమిలో బుధవారం రాత్రి సుమారు అర ఎకరా స్థలంలో ప్రహరీని నిర్మించినట్టు స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో గురువారం ఆయన ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. తక్షణమే ప్రహరీని తొలగించి తనకు ఫొటోలు పంపాలని ఆదేశించారు. సర్కారు స్థలాలను పరిరక్షించే బాధ్యతను వీఆర్వోలపై ఉందని, చూసీచూడనట్టు వ్యవహరిస్తే చర్యలు తప్పవని వీఆర్వో స్వరూప్‌ను హెచ్చరించారు. ఒక్క సెంటు స్థలం కబ్జాకు గురైనా ఉపేక్షించేది లేదన్నారు. వీఆర్వో, సర్వేయర్‌లపై చర్యలకు నివేదించాలని సూచించారు.

కాగా కూర్మన్నపాలెం వుడా ఫేజ్-5 ఈస్ట్ బ్లాక్ రోడ్డు నంబర్-2 పక్కనున్న ప్రభుత్వ భూమిలో పిచ్చిమొక్కలు, తుప్పలను చదును చేసి కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆర్డీవోకు సమాచారం అందించారు. అర ఎకరా స్థలం ఉన్న దీని విలువ సుమారు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా. గతంలో ఇక్కడ ఆక్రమణలకు పాల్పడినప్పుడు వామపక్ష నాయకులు ధర్నా చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించి తొలగించారు. అయితే మళ్లీ ఇప్పుడు కబ్జారాయుళ్ల కళ్లు దీనిపై పడిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాగా సర్వే నంబర్ 47, 69లలో వాగు స్థలాలు కబ్జాకు గురవుతుండడంతో వాటిని కూడా ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పరిశీలించారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి పూర్తి వివరాలను తనకు అందించాలని అధికారులకు ఆదేశించారు.



86వ వార్డులో ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



బాక్సింగ్ పోటీల ట్రోఫీలను ఆవిష్కరించిన గణబాబు

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఫిబ్రవరి 29: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. యంగ్ ఫ్రెండ్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బంక్ కూడలిలో శుక్రవారం నుంచి మార్చి మూడో తేదీ వరకు జరగనున్న మూడో సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ట్రోఫీలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలను ఈ ప్రాంతంలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బాక్సింగ్ క్రీడాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణదేవ్, అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

జీవో నంబర్-1214ను రద్దు చేయాలని డిమాండ్

మల్కాపురం, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసేలా ఉన్న జీవో నంబర్-1214ను తక్షణమే రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం 59వ వార్డులోని లేబర్ జంక్షన్ వద్ద నెహ్రూనగర్ భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉంచిన క్లెయిమ్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. 60 ఏళ్లు దాటిన భవన నిర్మాణ రంగం కార్మికులకు పింఛన్ అందజేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇసుక, సిమెంటు ధరలను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం జోన్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జె.రామునాయుడు, సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, సంఘం సభ్యులు పైడినాయుడు, వై.గంగాధర్, బి.శ్రీను, సుభాన్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డులో భారీ వాహనాలను నిషేధించాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 29: ఉక్కు కార్మికుల రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా బీసీ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని స్టీల్‌ప్లాంట్ ట్రేడ్ యూనియన్ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు గురువారం ప్లాంట్ భద్రతా విభాగం డీజీఎం శ్రీరాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గాజువాక, పెదగంట్యాడ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ఉక్కు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు స్టీల్‌ప్లాంట్‌కు బీసీ రోడ్డు నుంచే అధికంగా రాకపోకలు సాగిస్తున్నారని, మూడు షిఫ్టులతో పాటు జనరల్ షిఫ్టు కార్మికులతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. అదే సమయంలో స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, పెదగంట్యాడ పారిశ్రామికవాడలకు చెందిన భారీ వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నందున ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. అందువల్ల బీసీ రోడ్డులో భారీ వాహనాలను రాక పోకలను నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉక్కు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలను విడనాడాలి

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 29: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష, అనాలోచిత నిర్ణయాలను విడనాడాలని ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన గుర్తింపు యూనియన్ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. వేతన సవరణ విషయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి సాధించేందుకు కూడా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తగిన వనరులను సమకూర్చడం లేదని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఆపేందుకు యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, బీఎన్ రాజు, కొవిరి అవతారం, ప్రభాకరరెడ్డి, ప్రసాద్, నాయుడు, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

కోరమాండల్ మైదానంలో అబ్బురపరిచిన సైన్స్ ఫెయిర్

మల్కాపురం, ఫిబ్రవరి 29: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, సోషల్ వెల్ఫేర్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రామారావులు పేర్కొన్నారు. కోరమాండల్ ఎరువుల కర్మాగారం కంపెనీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా గురువారం సంస్థ మైదానంలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ఆలోచనలను వెలికితీసేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. పలువురు కోరమాండల్ అధికారులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 150 మంది విద్యార్థులు పలు ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డీవీడీ మూర్తి, కోరమాండల్ ఎరువుల కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ జ్ఞానసుందరం, డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువున్న రాజేష్ కోరమాండల్ కర్మాగారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మంచి ప్రతిభ కనబరచడంతో స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపింది. రైతులు పండించే పంటకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రాజేశ్ రూపొందించిన నమూనా ప్రాజెక్టు అందరి మన్ననలు అందుకుంది. ఈ మేరకు రాజేశ్‌ను హెచ్‌ఎం పి.సుగుణావతి, సైన్స్ ఉపాధ్యాయులు కిరణ్, లక్ష్మి, తదితరులు అభినందించారు.



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు తిలకిస్తున్న దృశ్యం

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



కార్యక్రమంలో పాల్గొన్న గణబాబు, ఆడారి ఆనంద్‌కుమార్

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్ సమీపంలోని కనకమహాలక్ష్మీనగర్‌లోని ఆలయంలో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనందర్‌కుమార్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

అదేవిధంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ బొమ్మిడి రమణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. తొలుత భీమశంకర్‌శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం దీక్షాధారణం, వాస్తు యాగిని క్షేత్ర పాలక నవగ్రహ మండపం, గణపతి హోమం, సూర్య నమస్కారాలు, వేద పారాయణం, నవరత్న స్థాపనం, యంత్ర స్థాపన, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, తదితర కార్యక్రమాలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 కలశాలతో పసుపు కుంకుమలతో అభిషేకం, క్షీరాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డీటీ నాయుడు, కృష్ణంరాజు, పెద్దినాయుడు, రాంప్రసాద్, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ, వైసీపీకి చెందిన నేతలు గణబాబు, ఆడారి ఆనంద్‌కుమార్ ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

చిన్నారి వైద్యానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం

మల్కాపురం, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీకి చెందిన కె.సురేశ్, రత్నకుమారిల కుమార్తె వేదవిక (8 నెలలు)కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తానని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధ పడుతున్న చిన్నారి వైద్యానికి రూ.30 లక్షల ఖర్చవుతుందని, ఇందులో రూ.25 లక్షలను ఫండ్ రైజింగ్ భాగంగా ఐకాన్ ఆస్పత్రి సర్దుబాటు చేస్తుందని, మిగతా ఐదు లక్షల కోసం కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు.. ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. దీంతో ప్రస్తుతం వేదవికకు ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్నారు.

ఘనంగా దుర్గమాంబ పండుగ

అగనంపూడి, ఫిబ్రవరి 29: పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దుర్గమాంబను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.జగన్నాథరావు, ఎ.సన్యాసిఅప్పారావు, వెంకటరావు, అప్పలరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న భక్తులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్ల నరవలో నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టను గురువారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అస్త్ర రాజార్చిన, దీక్షాధారణలు, రుత్విక్ వరుణలు, అఖండ దీపారాధన, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. అమ్మవారి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.



ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

అప్పికొండపై మహా శివరాత్రి నిర్వహణకు ఏర్పాట్లు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 29: అప్పికొండపై మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. అప్పికొండ శివాలయ ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, రాత్రి జాగరణ చేస్తారు కాబట్టి పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే సముద్ర స్నానాలు చేసేవారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. గాజువాక, అనకాపల్లి, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి అప్పికొండకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దేవదాయ ధర్మాదాయశాఖ ఫెస్టివల్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి, ఈవో అల్లు జగన్నాథం, ఆలయ చైర్మన్ గంగరాజు, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు, ఆర్టీసీ, జీవీఎంసీ, ట్రాఫిక్, ఇంజనీరింగ్ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు

పెందుర్తి, ఫిబ్రవరి 29: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలుగా పలు రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 34 పుస్తకాలను ఈ లైబ్రరీకి అందజేశారు. గురువారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో పలువురు ఈ పుస్తకాలను ప్రదర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవలసిందిగా సూర్యకళ కోరారు.

ప్రధాన కూడళ్లలో నిఘా నేత్రాలు

దొంగతనాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలకు చెక్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 29: మహా నగరంలోని అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. వేంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్, అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రోడ్డు, ప్రధాన రహదారి, నరసింహనగర్ ప్రాంతాల్లోని కూడళ్లతో పాటు వాణిజ్య సముదాయాలు, రైతు బజార్లు, అపార్ట్‌మెంట్ల వద్ద, పెట్రోల్ బంకులు, బ్యాంకులు, హోటళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలకు పాల్పడాలనుకునే వారు వెనకంజ వేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ ఎక్కడైనా చోరీలు, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను ఇష్టారాజ్యంగా నడిపే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా ఆస్కారం ఉంటుంది. మొత్తంమీద ఇటు శాంతిభద్రతల దృష్ట్యా గానీ అటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కానీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.


వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు


నరసింహనగర్ రైతు బజారులో సీసీ కెమెరాలు


రుషికొండ రహదారిపై స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ఓపీఎస్ అమలు చేస్తామన్న పార్టీకే మద్దతు

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్

మద్దిపాలెం, ఫిబ్రవరి 29: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే రానున్న ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ అన్నారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన ఓటు మన భవిష్యత్తు-ఓటు ఫర్ ఓపీఎస్' పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే తమ మేనిఫెస్టోలో ఓపీఎస్‌ను అమలు చేస్తామని, మొదటి సంతకం ఓపీఎస్ ఫైలుపైనే చేస్తామని హామీ ఇస్తుందో ఆ పార్టీకే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేత దాసరి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అప్పారావు, జిల్లా నాయకులు ఎస్.ప్రభాకర్, కె.రాంబాబు, చుక్క సత్యం, రిజ్వాన్, రియాజ్, టి.జగన్, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండపై విధ్వంసం సృష్టించిన వైసీపీ

జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్

సీతంపేట, ఫిబ్రవరి 29: వందల ఏళ్ల చరిత్ర కలిగిన రుషికొండపై వైసీపీ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ విమర్శించారు. పండుగలు వసేత రుషికొండకు వచ్చేస్తు న్నానంటూ సీఎం జగన్ దీపావళి, దసరా, సంక్రాంతి, ఉగాది.. ఇలా ఏ పండుగను వదల్లేదని.. చివరకు గుట్టుచప్పుడు కాకుండా మంత్రి రోజాతో రుషికొండపై భవనాన్ని ప్రారంభింపజేశారని ఎద్దేవా చేశారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద కోట్ల రూపాయల ఆదాయం తెచ్చే హరిత రిసార్ట్‌ను కుట్రతోనే కూలగొట్టారని, 9.88 ఎకరాల్లో నిర్మాణాలు చేపడతామని అనుమతులు తీసుకుని 23 ఎకరాల మేరకు రుషికొండను తవ్వేశారని మండిపడ్డారు. రుషికొండపై భవనాల నిర్మాణంపై కోర్టులో కేసులు ఉండగా ప్రారంభించడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు.

జగన్‌కు చట్టాలు, కోర్టులంటే భయం లేదని, పులి అని చెప్పుకునే తాడేపల్లి పిల్లి రుషికొండపై జరిగిన భవన ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారమే నిర్మాణాలుంటే మీడియాను, ప్రజలను ఎందుకు అనుమతించలేదన్నారు. ఈ సమావేశంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి యాదవ్

నటరాజ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో గజ్జ పూజ

సీతంపేట, ఫిబ్రవరి 29: శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవనంలో నటరాజ నృత్య నికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులకు గురువారం ఘనంగా గజ్జ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ కళలతోనే సాంస్కృతిక వైభవం ఉట్టి పడుతుందన్నారు. కె.సన్యాసిరావు, వెంకటేశ్వరావు, డాక్టర్ బీపీఎస్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో సామాజిక భవనాలు ప్రారంభం

సీతమ్మధార, ఫిబ్రవరి 29: జీవీఎంసీ 24వ వార్డు పరిధిలోని నక్కవానిపాలెం, క్రాంతినగర్, పాత రేసపువానిపాలెం ప్రాంతాల్లో రూ.45 లక్షలతో నిర్మించిన మూడు సామాజిక భవనాలను గురువారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ 'ఉత్తర' సమన్వయకర్త కేకే రాజు పూజ చేశారు.

ఉపాధ్యాయినికి ఘనంగా సన్మానం

సీతమ్మధార, ఫిబ్రవరి 29: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలో గల ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న నిష్ఠల అనుసూయ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

సీతంపేట, ఫిబ్రవరి 29: సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం 34వ వార్షికోత్సవాన్ని పురస్క రించుకుని పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వ ర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ, శైవాగమ పండితులు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం వేదమంత్రాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఇందులో కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, వాస్తు పూజ అంకురార్పన, ధ్వజారోహనం, అగ్ని ప్రతిష్ఠాపన, తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పార్వతీ పరమేశ్వరుల కలాణాన్ని వీక్షించారు.


వేదికపై శివపార్వతులు


పీఠాధిపతి జయరాజ్‌ను సన్మానించిన దృశ్యం

విశాఖ అగ్రపీఠాధిపతి జయరాజ్‌కు అభినందనలు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 29 : రోమన్ కేథలిక్ మిషన్ విశాఖ అగ్రపీఠ పరిపాలానాధికారిగా నియమితులైన డాక్టర్ పొలిమేర జయరాజును జ్ఞానాపురంలోని ప్రధాన పునీతపేతురు దేవాలయంలో చర్చి ఫాదర్లు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రకాష్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, బాల శౌరి, కోన జయరాజ్, పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్ పాల్గొన్నారు.

'రాజేశ్‌కు ఇచ్చిన టికెట్‌ను రద్దు చేయాలి'


విలేకరుల సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 29 : మహాసేన రాజేశ్‌కు ఇచ్చిన టికెట్‌ను వెంటనే రద్దు చేయాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుడు వీవీ వామనరావు కోరారు. గురువారం బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన బ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని, అగ్రవర్ణాలను అవమానిస్తూ మాట్లాడిన రాజేష్‌కు వచ్చే ఎన్నికల్లో టీడీపీ పి. గన్నవరం టికెట్ కేటాయించిందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. రాజేశ్ బ్రాహ్మణ అమ్మాయిలను అవమానపరిచారని అటువంటి వ్యక్తిని ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రోత్సాహించడం తగదని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆకెళ్ల వెంకటరమణమూర్తి, శ్రీవాత్సవ్, నందూరి సుబ్రహ్మణ్యం, పీవీ నారాయణ, జోష్యుల సురేష్, రాచకొండ దశరథ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యూరాలజీ విభాగంలో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం

మహారాణిపేట, ఫిబ్రవరి 29 : కేజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో స్ట్రోక్ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. ఆరు పడకల యూనిట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో డా. ఎస్.గోపి, డా కె. వెంకటేశ్వర్లు, డా వై. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మహారాణిపేట, ఫిబ్రవరి 29 : కేజీహెచ్‌లో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగం వద్ద గోపాలపట్నంకు చెందిన పి. సురేష్ (32) ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బంది గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా కేజీహెచ్‌లో ఐదు ద్విచక్ర వాహనాలు, మల్కాపురం సమీపంలో రెండు చోరీ చేసినట్టు అంగీకరించాడు. ఈమేరకు క్రైమ్ ఎస్‌ఐ ఎస్. రామ్మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తుప్పలతో అడవిని తలపిస్తున్న సెమెట్రీ

రెజిమెంటల్ సెమెట్రీలో పేరుకుపోయిన తుప్పలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 29 : జీవీఎంసీ 31, 29వ వార్డుల పరిధిలో ఉన్న రెజిమెంటల్ సెమెట్రీ ద్వారం డంపింగ్‌యార్డ్‌లా మారిపోయింది. సెమెట్రీ చుట్టు పక్కల ఉన్న వారు కోళ్ల వ్యర్థాలు, ఇతర చెత్తను సెమెట్రీలో పడేస్తుండడంతో కాలుష్యం పెరిగిపోతోంది. ఈ సెమెట్రీని 1700లో ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఇక్కడ అనేక మంది ప్రముఖుల సమాధులను ఏర్పాటు చేశారు. ఇది వాల్తేరు సెమెట్రీకి అనుబంధంగా పనిచేస్తుంది. ఏటా రెండు, మూడుసార్లు మాత్రమే పరిశుభ్రం చేయిస్తున్నారు. నిధుల లేని వల్ల కొన్నాళ్లుగా పనులు చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి సెమెట్రీ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనాల అద్దాలకు ఫిల్మ్‌లు అతికిస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 29 : కార్లు, ఇతర వాహనాల యజమానులు అద్దాలకు ఎటువంటి ఫిల్మ్‌లు అతికించరాదని ట్రాఫిక్ ఏడీసీపీ జి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళల అక్రమ రవాణా, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, కిడ్నాప్, తదితర నేరాలను అరికట్టే ఉద్దేశంతో సుప్రీం కోర్టు వాహనాల అద్దాల తయారీ సమయంలో దృశ్య క్రాంతి ప్రసారం ముందు వెనుక అద్దాలకు 70 శాతం పక్క అద్దాలకు 50 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలి పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉడా కాలనీలో వీధి కుక్కల భయం!

మురళీనగర్, ఫిబ్రవరి 29 : ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో వీధి కుక్కల సంచారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కలు గుంపు గుంపులుగా సంచరిస్తూ వాహనాలపై వెళ్లే వారి వెంటపడుతున్నాయి. పిల్లలు సాయంత్రం పార్కులు, ట్యూషన్ సెంటర్లకు వెళ్లి వచ్చేవరకు తల్లి దండ్రులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కొండవాలులో నిర్మానుష్యంగా ఉండే ప్రాంతం కావడంతో ఉడా కాలనీ ఎల్ఐజీ, ఎంఐజీ ఫేజ్‌లతో పాటు విలాస భవనాలు ఉండే హెచ్ఐజీ సెక్టార్లు, పార్కుల వద్ద వీటి తాకిడి ఎక్కువగా ఉంది. ఆర్టీఓ కార్యాలయం పరిసరాలు, ఆలయాల వద్ద వీధి కుక్కల సంచా రంతో నివాసితులు పగలు, రాత్రి వేళల్లోనూ ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడు తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వీధిలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

అడుగడుగునా నిఘా!

... 5వ పేజీ తరువాయి

సమాధానం ఇవ్వడం లేదు. అన్ని అనుమతులతో పక్కాగా నిర్మాణాలు జరిగాయని చెబుతున్నప్పటికీ, ఇంతలా ప్రజలను నిర్బంధించి కార్యక్రమం నిర్వహించడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులకు నరకయాతన

బీచ్‌రోడ్డులో పలు విద్యాలయాలు ఉన్నాయి. ఐటీ కంపెనీలు కూడా ఇదే మార్గంలో ఏర్పాటు చేశారు. వీటిలో వందల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. నగరంలో నివాసముంటూ ప్రతిరోజూ ఆయా కార్యాలయాలకు వెళ్లి, వస్తుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఉద్యోగులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఏ చిన్న కార్యక్రమం జరిగినా వందల సంఖ్యలో పోలీసులను మోహరించడం, తనిఖీల పేరుతో ఉద్యోగులను వేధించడం రివాజుగా మారిపోయింది. గురువారం కూడా ఇదే పరిస్థితి ఎదురయింది. ద్విచక్రవాహనాలు, కార్లలో వస్తున్న ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. విస్తృత తనిఖీలు, శల్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలను ఆరా తీశారు. ఐడీ కార్డులు చూపించినప్పటికీ.. ఆయా కంపెనీలకు మరో దారి లేకపోతేనే రుషికొండ మీదుగా ప్రయాణానికి అనుమతించారు. లేదంటే ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలంటూ వెనక్కి పంపించేశారు. ఫలితంగా సమయానికి కార్యాలయాలకు చేరుకోలేకపోయామని పలువురు వాపోయారు.

మీడియాపైనా ఆంక్షలు

బీచ్‌రోడ్డులో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు అనుమానితులను రుషికొండ వైపు వెళ్లకుండా వెనక్కి పంపించారు. మీడియా ప్రతినిధులను కూడా రుషికొండ పరిసరాల వరకు చేరనివ్వలేదు. రుషికొండ రహదారికి ఇవతల వైపు నిల్చొని లోపలికి వెళ్తున్న వాహనాల ఫొటోలు తీసుకున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరి మొబైల్ ఫోన్‌ని ఓ పోలీస్ అధికారి లాక్కున్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రుషికొండకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి, ముందుగానే హౌస్ అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో రుషికొండ వరకు వెళ్లకుండా ఆపేశారు. సీఎం జగన్ పర్యటనల్లో భద్రత పేరుతో హడావుడి చేసే పోలీసులు ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఇన్ని అడ్డంకులు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

కొత్త ఓటర్లు 14,475

... 5వ పేజీ తరువాయి

కొత్తగా ఓటరుగా నమోదు కాగా 4,934 మందిని తొలగించారు. కొత్త ఓటర్లగా జిల్లాలో అత్యధికంగా గాజువాకలో 4,546 మంది చేరగా, తక్కువగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 2,118 మంది చేరారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల తరువాత పోలింగ్‌కు పదిరోజుల ముందు వరకు కొత్తగా ఓటర్ల చేర్పులు, మార్పులకు అవకాశం ఉన్నందున జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

... 5వ పేజీ తరువాయి

అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారన్నారు. ఏపీని గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాలో నంబరు వన్ స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశాడన్నారు. జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని, మీ పిల్లలతోపాటు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం 'సూపర్ సిక్స్'ను అమలు చేస్తుందని, మహిళలకు మరిన్ని పథకాలను తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు.

భయపెడుతున్న చోరీలు

... 5వ పేజీ తరువాయి

జబాబుదారీతనం లోపించిందనే వ్యాఖ్యలు పోలీసు సిబ్బంది నుంచే వినిపిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక వేడుక పేరుతో అధికార పార్టీ నేతలకు బందోబస్తులు, ప్రముఖుల పర్యటనల వద్ద విధుల్లో ఉన్నతాధికారులు తలమునకలవుతున్నారు. దీంతో క్రైమ్ విభాగం పనితీరు సమీక్షించడం, కొత్తగా నేరం జరిగితే ఎవరు పాల్పడి ఉంటారనే దానిపై విశ్లేషణ చేయడం, ఆధారాలు సేకరించడం, ఆ తరహా నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ, ఎస్ఐలతోపాటు కిందిస్థాయి సిబ్బందితో విశ్లేషించే పరిస్థితి కనిపించడం లేదు. క్రైమ్ విభాగంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఎస్ఐలే బాధ్యతలు నిర్వహిస్తుండడంతో వారిని ప్రశ్నించే నాథుడే లేకుండా పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఒకే తరహా ముఠా పలు ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్నా పోలీసులు గుర్తించలేకపోతున్నారని పోలీస్‌శాఖలోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

'ఉత్తరం'లో మహా శివరాత్రికి సిద్ధమవుతున్న శైవ క్షేత్రాలు

మురళీనగర్, ఫిబ్రవరి 29: ఉత్తర నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు మహా శివరాత్రికి ముస్తాబవుతున్నాయి. మార్చి ఎనిమిదిన మహా శివరాత్రి నేపథ్యంలో ప్రసిద్ధ ఆలయాల్లో ఘనంగా పూజాది కార్యక్రమాలను నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. మురళీనగర్ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ శాంతి ధామంలో ఐదు రోజుల జరిగే మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్యేక సంబరాలు జరుపుతామని సెంటర్ నిర్వాహకురాలు బీకే అపరంజి తెలిపారు. ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి శివతత్వాన్ని బోధించడంతో పాటు, శాంతి ధామం కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడతామన్నారు. మాధవధార కొండపై శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో సింహాచల దేవస్థానం అధ్వర్యంలో వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన అత్యధికంగా భక్తులు తరలి రానున్నందున దర్శన ఏర్పాట్లు, సౌకర్యాలపై ఈవో ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోని సోమేశ్వర ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 49వ వార్డు పరిధి కంచరపాలెం బర్మాక్యాంపులోని శివాలయం సహా పలు గ్రామ కమిటీల ఆధ్వర్యంలో, మురళీనగర్ శివాలయం, తదితర శైవ క్షేత్రాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్నాయి.

వయోశ్రీ యోజన లబ్ధిదారుల గుర్తింపు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 29 : ప్రధాని రాష్ట్రీయ వయోశ్రీయోజన పథకం లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం గంగవరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు హాజరయ్యారు. 60 ఏళ్లు పైబడిన వారికి కళ్లద్దాలు, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్స్, నడుము బెల్టులు, మోకాళ్ల బెల్టులు, తదితర ఆరోగ్య అవసర ఉపకరణాలు అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ వయోశ్రీయోజన పథకం కో-ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, స్థానిక పెద్దలు గరికిన పైడిరాజు, వెంకటేశ్, పి.అప్పారావు, మాధవి, జీలకర్ర రమణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతర రాట

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29 : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా గురువారం అమ్మవారి బాలాలయంలో రాట ముహూర్తాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభం కానుందని, ఎనిమిదో తేదీన కొత్త అమావాస్య పూజలు జరగనున్నాయని ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిదో తేదీన ఆలయంలో ఉగాది వేడుకలు జరుగుతాయన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం



గౌరీ, పరమేశ్వరుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వెంకోజిపాలెం, ఫిబ్రవరి 29 : కొత్తవెంకోజిపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, గౌరీజ్ఞానలింగేశ్వరాలయంలో గౌరీపరమేశ్వరుల కల్యాణం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఆలయం 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కల్యాణం నిర్వ హించారు. గ్రామస్థులు, చుట్టు పక్కల ప్రాంతాల వారు భారీగా పాల్గొని గౌరీ పరమేశ్వరులను భక్తి శ్రద్ధలతో కొలిచారు. శివ నామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం 8 గంటలకు మంగళధ్వనితో ప్రారంభమైన పూజలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.సాయంత్రం స్వామివారి తిరువీధి జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ,అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, రామకృష్ణశర్మ, బాల భాస్కరశర్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే ఆలయ సముదాయంలో ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం వార్షికోత్సవం కూడా ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాయుడు, దేవస్థానం సిబ్బంది రాంబాబు, రామాంజనేయులు, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల రమణ, కార్యవర్గ సభ్యులు ఆదారి కామేశ్వరరావు, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, పీల జోష్యుల, తదితరులు పాల్గొన్నారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 29 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పరిమళభరిత పుష్పమాలలతో, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మ నిధి నుంచి సిరి సంపెంగలు తీసుకువచ్చి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ పుష్పంతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు.

మహా యజ్ఞానికి విరాళాలు

సింహాచలం, ఫిబ్రవరి 29 : సింహగిరిపై ఈనెల 26 నుంచి జరిగే సుదర్శన నారసింహ మహాయజ్ఞంలో పాల్గొనడానికి భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు ఇస్తున్నారు. గురువారం ఎంవీపీ కాలనీకి చెందిన కేతినేడి సాయికుమార్ యజ్ఞంలో వినియోగించేందుకు అవసరమైన జీడి పప్పు, రాజస్థాన్ నుంచి ఆవు నెయ్యి సమర్పించగా, సబ్బవరం ప్రాంతానికి చెందిన బోకం శ్రీనివాస్ యజ్ఞం జరిగే అన్ని రోజులు అన్నప్రసాద వితరణకు కావాల్సిన బియ్యం, పప్పులు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ దాతలు విరాళాలను నేరుగా యజ్ఞ సమాచార కేంద్రంలో లేదా ఆన్‌లైన్‌లో దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా వస్తు రూపంలో లేదా నగదు రూపంలో సమర్పించవచ్చునని చెప్పారు. త్వరలోనే యజ్ఞ టికెట్ల విక్రయాలను కొండ దిగువన కూడా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమునిపట్నం, ఫిబ్రవరి 29 : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట టాస్ పార్క్ కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరుగు చిన్నారావు, మేరుగు అప్పన్న, బడే చిన్నారావు,వాసుపల్లి నర్సింగరావు, దూడ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలు వేలం వాయిదా

భీమునిపట్నం, ఫిబ్రవరి 29 : పట్టణంలో పలుచోట్ల ఆశీలు వసూలుకు సంబంధించి జోనల్ కార్యాలయంలో గురువారం వేలం పాట నిర్వహించారు. కాంట్రాక్టర్లు ఎవరూ హాజరుకాకపోవడంతో వేలాన్ని ఈనెల 7వ తేదీకి వాయిదా వేసినట్టు జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మి తెలిపారు. 3వ వార్డులో భీమిలి రోడ్డు మార్జిన్, లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్‌లో రోజువారీ ఆశీలు వసూలు, బీచ్ రోడ్‌లోని జీవీఎంసీ షాపు రూమును మూడేళ్ల కాలపరిమితికి అద్దెకు ఇవ్వడానికి వేలం పాటలు నిర్వహించారు.

ఓటమి తప్పదనే చిల్లర పనులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 29 : ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చిల్లర పనులకు వైసీపీ నాయకులు పాల్పడుతున్నారని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ ప్రణవ్‌గోపాల్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 16వ వార్డులోని పాతవెంకోజీపాలెం కనకమ్మ ఆలయం వద్ద వైసీపీ తూర్పు కన్వీనర్ ఎంవీవీ సత్యనారాయణ ఓట్లు అభ్యర్థించడంలో భాగంగా మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేశారని, ఇందుకు వలంటీర్లు కూడా సహకరించడం దుర్మార్గపు రాజకీయమని విమర్శించారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26,టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 28, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26 , కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ[లో..



ఎంవీపీ కాలనీలో హరేకృష్ణ మూవ్‌మెంట్ నగర సంకీర్తన

ఘనంగా నగర సంకీర్తన

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 29 : ఎంవీపీ కాలనీ ప్రధాన రహదారిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూరా 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంవీపీ రైతు బజారు నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన పలు ప్రాంతాల మీదుగా తిరిగి ఆరో సెక్టరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నిష్కించిన భక్త దాస ఆధ్యాత్మిక అంశాలను ప్రసంగించారు. కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజా దాస, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు : డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

సింహాచలం, ఫిబ్రవరి 29 : ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను అవగాహనతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డీఈఓ ఎల్. చంద్రకళ అన్నారు. గురువారం సాయంత్రం ఆమె అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షలంటే భయం వద్దని, సరైన రీతిలో అర్థం చేసుకుని చదివితే తప్పక విజయం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ ఓఎస్డీ కృష్ణమోహన్, తదితరులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 29 : భారత్ త్వరలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ఏయూ ఓఎస్డీ ఆచార్య కృష్ణమోహన్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో గురువారం నిర్వహించిన దిశ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ మీట్‌లో ఆయన మాట్లాడారు. తరగతుల్లో నేర్చుకున్న పాఠాలను పరిశోధనాత్మకంగా అలవర్చుకోవాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడే నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్లూయెంట్ గ్రిడ్ ఉపాధ్యక్షురాలు విన్‌స్టన్ ఏకే ఆడమ్స్, సమతా కళాశాల డీన్ ప్రొఫెసర్ విజయ రవీంద్ర, డైరెక్టర్ శ్రీనివాసరావు, కన్వీనర్ మాధవీలత, కోకన్వీనర్ డి. హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

155 మందికి కళ్లద్దాలు పంపిణీ

ఆరిలోవ, ఫిబ్రవరి 29 : జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో 155 మందికి తూర్పు ఎమ్మెల్యే వెల గపూడి రామకృష్ణబాబు గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత నెల 12న గాంధీనగర్‌లో గీతం ఆస్పత్రి, ఎన్‌టీఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 300 మందికి పరీ క్షలు చేయగా 155 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు సూచించారు. ఈమేరకు గీతం ఆస్పత్రి అందజేసిన కళ్లద్దాలను ఎమ్మెల్యే వెలగపూడి పంపిణీ చేశారు. టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పోతన్నరెడ్డి, కృష్ణంరాజు, మూది అప్పారావు, మంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

యువత సామాజిక సేవలో ముందుండాలి

ఆనందపురం, ఫిబ్రవరి 29 : యువత సామాజిక సేవలో ముందుండాలని ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ అన్నారు. గురువారం కణమాం గ్రామంలో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలను విడనాడి సన్మార్గంలో పయనించాలన్నారు. కళాశాల ఆధ్వర్యంలో ఏడు రోజులుగా గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో హరగోపాల్, డైరెక్టర్ రాజ మురుగుదాస్, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 29 : మండలంలోని పాండ్రంగి పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు వాటిని సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సంఘం పర్సన్ ఇన్‌చార్జి అముజూరి అప్పారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు ఈనెల 30లోగా వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందన్నారు. బ్యాంకు రికార్డులను కంప్యూటరీకరణ చేస్తుండడంతో రైతులంతా తప్పకుండా వన్‌బీ, అడంగల్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు బ్యాంకులో సకాలంలో అందజేయాలని సూచించారు.

పల్స్ పోలియోపై అవగాహన

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 29 : మండలంలో ఈనెల 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బంది ఇటుక బట్టీల్లో పని చేసే మహిళా కూలీలకు అవగాహన కల్పించారు. గురువారం వారు మద్ది, బోని, కృష్ణాపురం, ఇసకలపాలెం, ఆర్చుకుపాలెం, వీకే పాలెం, పాండ్రంగి, సామయ్యవలస, శిర్లపాలెం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీ వద్ద మహిళలకు పల్స్ పోలియో చుక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు ఆదివారం జరిగే కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు.

'విసాయ్'లో ఏయూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 29 : ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు ఇటీవల చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రాజెక్టు కాంపిటీషన్ విసాయ్-2024లో సత్తాచాటారు. 200 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఏయూ బృందం ప్రథమ బహుమతి సాధించింది. నిర్వాహకులు ఇచ్చిన ప్రత్యేక అంశంపై నిర్వహించిన మరో పోటీలో ద్వితీయ బహుమతి, మరో బృందం కన్సలేషన్ బహుమతి పొందారు. విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

ఏయూతో ఆస్కా ఎంఓయూ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 29 : ఏయూతో ప్రముఖ ఎన్‌జీఓ సంస్థ ఆఫ్ సటికి ఆవాజ్ (ఆస్కా) అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈమేరకు వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, ఆస్కా అధ్యక్షుడు శివ్ వడ్లమూడి సంతకాలు చేశారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహణ, రక్తహీనతపై అవగాహన కల్పించడం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వంటి వ్యాధుల పట్ల అవగాహనకు అవసరమైన సహాయాన్ని అందించే దిశగా సంస్థ పని చేస్తుంది.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ, ఫిబ్రవరి 29 : విమ్స్‌లో శుక్రవారం న్యూరో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. శిబిరంలో బ్రెయిన్ స్ట్రోక్, నరాల సమస్యలు, వెన్నుముక, తలనొప్పి, పక్షవాతం, నడుము నొప్పి, చిన్న పిల్లల మానసిక వైకల్యం, తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామని చెప్పారు. ఓపీ బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

అంకితభావంతో పని చేసేవారికి గుర్తింపు

ఆరిలోవ, ఫిబ్రవరి 29 : వన్యప్రాణుల సంరక్షణకు గుడ్ల అప్పలనాయుడు ఎంతో తోడ్పడ్డారని జూపార్కు క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా అన్నారు. గురువారం అప్పలనాయుడు పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంకితభావంతో పనిచేసిన వారికి సమాజంలో ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందన్నారు. అనం తరం అప్పలనాయుడును పలువురు సత్కరించారు.కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, నాయుడు, ఉమాదేవి, పాల్గొన్నారు.

కృష్ణప్రసాద్‌కు సన్మానం



కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న గీతం సిబ్బంది

సాగర్‌నగర్/కొమ్మాది : విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వంటిపల్లి కృష్ణప్రసాద్ పలువురికి ఆదర్శనీయమని ప్రొఫెసర్ మాధవ్ ప్రసాద్, శరత్‌కుమార్ అన్నారు.గీతం వర్సిటీ డిప్యూటీ మేనేజరు (ఫైనాన్స్) కృష్ణ ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమంలో గురువారం వారు మాట్లాడారు. తన సేవల ద్వారా పదవికి వన్నె తీసుకువచ్చారన్నారు. అనంతరం ఆయనకు గీతం వర్సిటీ తరపున జ్ఞాపిక అందజేసి సత్కరించారు.అలాగే చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఆరేళ్లుగా బయాలజీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వాసా జానకి కూడా ఉద్యోగ విరమణ చేయడంతో పాఠశాల ఆవరణలో సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలను విడనాడాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 29 : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష, అనాలోచిత నిర్ణయాలను విడనాడాలని ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన గుర్తింపు యూనియన్ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. వేతన సవరణ విషయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి సాధించేందుకు కూడా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తగిన వనరులను సమకూర్చడం లేదని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఆపేందుకు యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, టీఎన్ రాజు, కొవిరి అవతారం, ప్రభాకరరెడ్డి, ప్రసాద్, నాయుడు, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

ఏయూకు రెండు అంతర్జాతీయ పేటెంట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలె,ం ఫిబ్రవరి 29 : ఏయూ రెండు అంతర్జాతీయ పేటెంట్‌లు సాధించింది. మెషీన్ లెర్నింగ్ ఆధారితంగా బయో మెడికల్ ఇమేజ్ విశ్లేషణ ద్వారా కచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేసే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ మంజూరైంది. మెషీన్ లెర్నింగ్ సహాయంతో ప్రారంభ దశలోనే వ్యాధి నిర్ధారణ చేయడం వల్ల రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించవచ్చు. తొలుత ఇండియాలోని పేటెంట్ ఆఫీస్ దీన్ని పబ్లిష్ చేయగా, తాజాగా సౌతాఫ్రికా దేశం పేటెంట్ గ్రాంట్ అందించింది. ఏయూ అంబేడ్కర్ ఛైర్ ఆరు నెలలుగా ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల మధ్య ఫీల్డ్ విజిట్ చేసి సేకరించిన డేటాను దీంతో అనుసంధానం చేయనున్నారు.

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏయూలోని దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే మూడు రోజుల కార్యక్రమాల పోస్టర్‌ను వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ధర్నా

భీమునిపట్నం, ఫిబ్రవరి 29 : ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ భీమిలి తాలూకా నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం భీమిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నంబరు 117 రద్దు చేయాలని, పాత బకాయిలను చెల్లించాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బి. సూర్యనారాయణ, పి. శ్రీనివాస్, చంద్రకళ, మండల శాఖ నాయకులు ఆర్. కోటి, కె. సన్యాసినాయుడు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ ఐఏఎస్



కప్ప స్తంభం వద్ద అనిత రాజేంద్ర దంపతులు

సింహాచలం, ఫిబ్రవరి 29 : వరాహ లక్ష్మీనృసింహస్వామిని తెలంగాణ రాష్ట్ర సర్వీస్ కమిషన్ సభ్యురాలు, ఐఏఎస్ అనిత రాజేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు.కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న ఆమె గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలను,అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

పెదజాలారిపేటలో పేరుకుపోయిన చెత్త



డెస్ట్ బిన్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 29 : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద చెత్త పేరుకుపోయింది. దీంతో స్థానికులు దుర్వాసనకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డెస్ట్ బిన్లకు పెద్ద పెద్ద రంధ్రాలు ఉండడంతో వాటిలో చెత్త వేస్తే బయటకు వస్తోంది. చెత్తను పందులు, కుక్కలు చిందరవందర చేస్తుండడంతో పరిసరాలు పాడవుతున్నాయి. దీనికితోడు రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తరలించడంతో పాటు డెస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం, ఫిబ్రవరి 29 : పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం. మౌనిక జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల తెలిపారు. గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26న విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మౌనిక ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. కాగా విద్యార్థిని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కామర్స్ హెచ్‌వోడీ సీహెచ్ విష్ణుమూర్తి, అధ్యాపకులు బి. సహదేవుడు, వై. శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

విమ్స్‌లో భద్రత పెంపునకు చర్యలు

ఆరిలోవ, ఫిబ్రవరి 29 : విమ్స్‌లో ఉద్యోగులు, రోగుల భద్రతకు మరిన్ని పటిష్ట చర్యలు తీసుకోనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఆస్పత్రికి మద్యం తాగి వచ్చి ఒక యువకుడు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆస్పత్రిలో భద్రత పెంపునకు పటిష్ట చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు.